# అవతారమా?

పంచానన తీర్థులు స్ఫురద్రూపి. మంత్రబలమూ, పరమార్థజ్ఞానమూ, శాస్త్ర పాండిత్యమూవున్న మనిషివలె కనపడతాడు. శాటిప రికి ఎక్కణ్ణించి వచ్చాడో తెలీదు. ఆవూరి మహాదాత, స్థితిపరుడు, రామచంద్రరావుగారు యీయన్ని రైల్లో కలుసుకొని, ఆయన సంభాషణకీ, ప్రజ్ఞకీ సంతోషించి తన యింటికి ఆహ్వానించాడు. తీర్థులుగారి శక్తివల్ల రామచంద్రరావుగారికి లేకలేక చక్కని కొడుకు పుట్టాడు. ఆయన వదినగారు ఏదో మంత్రోపదేశమయింది. ఆయన మేనల్లుడి క్షయ కుదిరింది. ఆయన అన్న కొడుకు బ్రహ్మసమాజం వొదిలాడు. ఇదిగాక వూళ్ళో అనేకమంది ఆయనవల్ల అనేక వుపకారాలు పొందారు. దెయ్యాలు పట్టిన వాళ్ళకి నయంచేశాడు. కొందరికి శనీ, దారిద్ర్యం వొదిలించాడు. దేవీ వుపాసన, అర్ధరాత్రులు కుంకుమపూజ, బ్రాహ్మణ సంతర్పణ, నిరంతర వేదాధ్యయనం జరుగుతూ వుంటాయి ఆయింటో. మొత్తానికి యీయన మూలాన ఊరు మేలుకుంది. మధ్యాన్నం పురాణం చెప్పడం, భగవద్గీతలు ఉపన్యసించడం, సూర్యనమస్కారాలు చేయించడంవల్ల అందరికీ పొద్దు పోతోంది. ఆ వూళ్ళోనే, ఆ ఇంటోనే స్థిరపడ్డాడు. ఏ వ్యాధివచ్చినా, అమ్మవారొచ్చినా, వానలులేకపోయినా జపాలు చేసి నయంచేసేవాడు. అందరిమీదా దయ, ఒక్క దురభ్యాసం, దుర్గుణం లేదు ఆయనలో.

అందరికీ ఆయనమీద అమితమైన భక్తీ, ప్రేమ. ముఖ్యంగా స్త్రీలకు, అందులో వితంతువులకి. మొగవాళ్ళకి ఆయన్ని చూస్తే అతి భయం. ముఖ్యంగా వర్తకులకి. ఆయన్నెదిరించడమన్నా, ఆయన్ని గురించి రహస్యంగానన్నా సరే తిరస్కారంగా మాట్లాట్టమన్నా అందరికీ భయం. రామచంద్రరావుగారిని బాకీ అడగవచ్చిన బెంగుళూరి వర్తకులు తండ్రీకొడుకుకూడా, ఎవరికీ అర్థంకాని జబ్బుతో, పదిహేనురోజుల్లో ఒకరి తరవాత ఒకరు చచ్చారు. ఆయనపూజలకి నూనె 'సప్లయి' చేసే సుబ్బయ్య డబ్బిమ్మని అడిగిన వారంలో కాలిమీద పుండులేచి నడవలేక పోయినాడు. పదిరోజుల్లో పెళ్ళాం తురకాడితో లేచిపోయింది. ఆ దెబ్బతో తీర్థులు ఆ వూరికి చక్రవర్తి అయినాడు. అడక్కుండానే అన్నీ తయారుగా యిస్తారు. ధాన్యం, పాలు, బట్టలు, అన్నీ!

తీర్థులు కాబట్టి సరిపోయిందిగాని, యింకొకరే ఐతే, యీ ఆడ వాళ్ళు మధ్యాహ్నం మొదలు, రాత్రిదాకా ఆ యింటోనూ, గుళ్ళలోనూ వుండడమూ, వొచ్చేవాళ్ళూ, పోయ్యేవాళ్ళూ, పూజలకి, భజనలకి, సహాయం చేసేవాళ్ళూ ఆయనకి వుపచారం చేసేవాళ్ళూ యిదంతా పెద్ద 'స్కాండల్' ఐ వుండును. అనుమానాలెక్కువవును. కాని నోరెత్తడానికీ మనసులోనన్నా అనుమాన పడడానికి హడల్. ఇంటి దగ్గర తిండి సరిగా దొరక్క అవస్థపడే మొగాళ్ళు నోరెత్తి ఏమి అనలేరు భార్యల్ని. ఆ వూళ్ళో ప్రతి ఆడదీ, రోజు కాకసారన్నా తీర్థులుగారి దర్శనం చేసుకుతీరుతుంది. ఎవరన్నా రాకపోయినారా, "ఏం దుర్గమ్మగారు రాలేదు" అంటాడు. అంతే, దుర్గమ్మగారు వొచ్చి పాదాలకు సాష్టాంగపడి, కారణం చెప్పుకుంటుంది. అట్లా వెలిగింది ఆయన ప్రభ. ఆయన 'తల్లీ' అంటే, 'దేవి' 'ఊ' అంటుందని పుకారు. ఆయన దేవినితప్ప తక్కిన స్త్రీలందర్నీ 'ఏమే' అంటాడు. ఎవరూ ఆగ్రహించరు.

తీర్థులుగారి శిష్యకోటిలో ప్రముఖురాలు పున్నమ్మ. ఆమె సాత్వికు రాలు. బాలవితంతువు. పదహారేళ్ళది, కలరాతో అవసానదశలోవున్న

ఆమెకి గతియైన అన్నకి, ప్రాణదానం చేశాడు. తీర్థులు. పదోయేట వితంతువైనప్పట్నించి, ఆమె యవ్వన సౌందర్యం యెటువంటి చిక్కుల్లోకి ఆమె నీడుస్తుందో అని భయపడి యోచించి, శ్రమపడి, ఆమెను పురాణాల్లో, పూజల్లో, సంస్కృత వేదాంతాల్లో పెంచారు. పున్నమ్మకి జీవితంమీద యింకా విరక్తికలగాలని తీర్థులదగ్గిరికి బోధనకై ప్రవేశపెట్టారు. తీర్థుల రూపవిలాసాలూ, ధీరత్వమూ, శక్తిజ్ఞానాలు, ఔన్నత్యమూ, పున్నమ్మ లేత హృదయాన్ని దిగ్భ్రమ నెత్తించాయి. ఆమెది చిన్న శరీరం. ఆమెరంగూ, నల్లని పెద్దజుట్టూ, రవికలేని పమిటలోంచి కనబడే బిగువు బుజాలూ, ఆమెకి చాలా అందాన్నిచ్చాయి. తాను చిన్నప్పట్నించి ఆరాధించే దైవం తీర్థుల్లో ఆవిర్భవించాడు పున్నమ్మకి. ఆయనకోసం ప్రాణమివ్వడం ఒక గొప్పకాదు ఆమెకు. పొద్దున్నే వెళ్ళి దినమల్లా ఆయనసేవలో గడిపి, రాత్రి ఆయన పడుకుంటేగాని యింటికి రాదు. తీర్థులగారేం చేస్తున్నారని అడగడానికిగానీ, ఆయన అనుగ్రహాన్ని సంపాయించడానికిగానీ ముందు పున్నమ్మగారిని సమీపించాలి. ఎవరికీ వుపదేశించని రహస్యమంత్రాన్ని వేదాంత రహస్యాన్ని ఆమెకి ఉపదేశించాడని చెప్పుకుంటున్నారు ప్రజలు. పున్నమ్మ యిప్పుడు ఒక్కనిమిషం తావళం తిప్పడం మానదు. ఎప్పుడూ కళ్ళు ధ్యానంలో రెప్పలువాల్చి వుంటాయి. వృధాగా ఒక్క మాట మాట్లాడదు. ప్రతినిమిషమూ ఈశ్వర నామ ముచ్చరిస్తో వుంటుంది. అంత చిన్నపిల్ల ముఖంలో ఆ దివ్యతేజం చూసి అందరికీ అద్భుతంగా వుంది ఆమెమీద పూజ్యభావం హెచ్చయింది.

ఒకరోజు యెండాకాలపురాత్రి పున్నమ్మ తీర్థులకి కాళ్ళు పిసుకుతోంది. అర్ధరాత్రయింది. ఎవరూలేరు. గురువు కళ్ళుమూశాడు. ఇంక యింటికి వెళ్ళివొచ్చనుకుంటోంది పున్నమ్మ. తీర్థులు చప్పున వొణకడం ప్రారంభించాడు. ఎన్నడూ జబ్బెరగని ఆయనకి యీ జబ్బేమని పున్నమ్మ చాల భయపడ్డది. ఈ జాడ్యాలకూ, బాధలకూ అతీతుడనుకుంది ఆయిన.

"చలి, చలి, శాలువకప్పు."

శాలువలేదు అక్కడ.

"ఏదో వొకటి కప్పు, తొరగా !"

తీసుకురావడానికి వెళ్ళబోతోంది.

"వెళ్ళకు. ఒక్కనిమిషం ఆగలేను కప్పు ఏదోఒకటి"

"ఏంలేదు"

"తొరగా."

"ఎవర్నన్నా పిలుస్తా"

"వొద్దు, తొరగా."

"ఏంలేదు"

"నీ జుట్టు కప్పు."

దగ్గరకు వెళ్ళింది. ముడి వూడదీసి ఆ పెద్దజుట్టును విదిలించి కప్పుకున్నాడు.

"హాయి ! హాయి ! అమ్మా బావుంది .. బావుంది ఇంకా చలి .. అబ్బా దగ్గిరికి ఇంకా దగ్గిరికి, నీ జుట్టులో నీవొంటో ఎంత వేడుందో ! ఎంతచలి, ఎంతచలి, ఇంకా దగ్గిరిగా !"

పున్నమ్మకి ఆశ్చర్యంగావుంది.

దగ్గిరికి లాక్కుంటున్నాడు. మెల్లిగా ఆమెనంతా ఆక్రమించు కుంటున్నాడు. వూరికే వొణుకుతాడు. పున్నమ్మ ఏపురుషుణ్ణీ అంతవరకు తాకలేదు ఆమెకు స్పష్టంగా తెలీదు పురుష సంబంధమంటే ఏమిటో. ఆమె కసలు ఆ వాంఛ యెన్నడూ ప్రారంభించలేదు. కొంతసేపు చూసింది. తీర్థులచెయ్యి ఆ వొణుకులో ఇటూ అటూ ఆమెశరీరంలో కదులుతోంది, పున్నమ్మకి అది సహజంగా తోచలేదు. ఏరోగానికీ అది చిహ్నంగా కనపడదు. లేచి వెళ్ళిపోవాలనివుంది. అసహ్యం సహజంగా కలుగుతోంది. కాని అమితమైన భయం. కోపమొస్తే ఆయనకి, తానేమౌతుంది ? ఏ దేవతనో తనమీదికి పంపితే ! శపిస్తే

కొంచెంసేపుండి — "వెడతాను. యింక పచ్చడం తెస్తాను" అంది.

"ఊఁ, మాట్లాడకు నేను దేవిని. ఉగ్రస్వరూపిణిని. నీవు నా భక్తురాలివి. నిన్నావహిస్తున్నాను. నేనే నువ్వు, నువ్వే నేను బిడ్డా, ఏమే—విను, నీ భక్తికి మెచ్చాను. నీలో ప్రవేశిస్తున్నాను, నా శక్తి నీ లోపల ప్రవేశిస్తోంది. నా దివ్యశక్తి — నీ వొళ్ళంతా వొణుకుతుంది, గగుర్పొడుస్తుంది. చెప్పలేని ఆనందం కలుగుతుంది. నా దివ్యస్వరూపం నువ్వు చూడలేవు. కళ్లుపోతాయి, మూసుకో. కళ్లుమూసుకో-"

అబ్బా యిదేమిటి ? యిట్లా చేస్తున్నాడు ? వొళ్ళంతా నీచమై పోతోంది. తలని ఊపిరాడకుండా అదుముతున్నాడు.

"వుండండి——స్వామీ——నన్నొదలండి."

"స్వామి ఎవరు ? మాట్లాడకు. చచ్చిపోతావు. పాపం ! భస్మమై పోతావు. కదలకు అయిపోయింది. వుండు-నేను ఈశ్వరిని. నా జ్యోతి నీలో ప్రవేశించింది. ధన్యురాలవైనావు."

కళ్ళు మూసుకుంది. అతని వూపిరి అతితీక్ష్ణంగా ఆమె మొహానికి తగులుతోంది. "ఏంజరిగినా, ఏమైనాసరే కదలకు. కదిలావా, తల సహస్ర.... నేను మంత్రస్వరూపిణిని, మహామంత్రంలో వున్నాను."

ఆమె కదలేదు.

తెల్లవారికట్ట మూడింటిదాకా చలి ఆగలేదు, తీర్థులకి.

రెండు నెల్లయింది.

ఒకనాడు మధ్యాహ్నం పున్నమ్మ శిరసువంచి భక్తితో "నాకు మందుకావాలి" అంది నమ్రతగా.

"ఎందుకు ?"

"పొద్దున్నే వాంతులుగా వున్నాయి."

"ఒహో ! సరే నయంచేస్తాను"

ఆనాటినుంచి ప్రతిదినమూ తీర్థులు ఏదో గొప్పగొప్ప మందులు తయారుచేసి యిప్పాడు-కాని డోకులు మాత్రం కట్టనేలేదు. "ఈ మందుతో ఇట్లాంటి డోకులు ఎన్నో కట్టించాను, కానీ నీ దేహం చాలా విచిత్రంగా వుంది. ఇంక లాభంలేదు, ఇవి కట్టేడోకులు కావు మంత్రమో తంత్రమో ప్రయోగించాలి" అన్నాడు.

మోడు నెల్లయింది. పున్నమ్మకళ్లు ఇంకా అంతర్ముఖములైనాయి. ఆమె చంపలు ఇంకా పాలిపోయినాయి. ఆమె మాటలు ఇంకా తక్కువై నాయి. ఆమె సేవలు ఇంకా పొద్దుపోతున్నాయి.

తీర్థులు ఆ వర్షాకాలం యజ్ఞం మొదలుపెట్టాడు అగ్నిగుండము ముందు ఆయన కూచ్చుని వున్నాడు. వందమంది బ్రాహ్మలు మంత్రాలు చదువుతున్నారు. పున్నమ్మ సామగ్రులు అందిస్తోంది. ఊరంతా ఆహ్వా నింపబడ్డారు. తీర్థులు లేచి ఇట్లా మాట్లాడాడు. "ఒక గొప్ప విశేషం ఈ దేశానికి. ఈ దేశానికేకాదు, లోకానికంతా మంగళకరమైన వార్త నేను మీకు చెప్పబోతున్నాను. ఈ తాటిపర్రు ఈశ్వరుడిచేత అనుగ్రహింప బడ్డది. ఈ ప్రజలందరు ధన్యులు. ఇంత పుణ్యక్షేత్రం కావడంచేతనే ఈశ్వరుడు నన్నిక్కడికి పంపినట్లున్నాడు. ఈ వూరి నామం యింకా లోకమంతా మోగబోతోంది? నిన్న రాత్రి రెండుగంటలప్పుడు ఒక పెద్ద వెలుగు బంగారుతేజము బంగారు మెత్తదనము కలది ఆకాశంమీదినించి బైలుదేరి మెల్లిగా క్రమంగా భూమి మీదికి దిగింది. నేను చూస్తోనే వున్నాను. అంతవరకు నాకు నిద్రపట్టనేలేదు. నా హృదయంలో అద్భుత మైనభక్తి ఉద్భవించింది. దేవతలు నిస్వనము లూదారు. పుష్పవర్షం కురిసింది. మునులు కీర్తనలు పాడారు. అవన్నీ మీకు వినపడవు. ఆ తేజస్సు భూగోళముపైని ఒక్క నిమిషం నిలిచి వెతికి మనదేశంవేపు తిరిగి, మనవూళ్ళో ప్రవేశించింది. ఏదో అవతార ప్రారంభమని నాకు తెలియనే తెలుసు. ఈ తాటిపర్రులో యే గర్భంలోనో ఈశ్వరతేజస్సు

అవతారమెత్తిందని స్పష్టమయింది. కాని ఈ అవతారం అవసరమేమని యోచిస్తూ నిద్రపోయినాను. కన్నులు మూయగానే నాముందు శ్వేతాంబరధరుడు, రక్తనేత్రుడు. దయాప్రపూర్ణుడైన దేవమాత దివ్యతేజస్సుతో వెలుగులో, నిలబడి ఇట్లా అన్నాడు: "వత్సా! ఇందాకటి వెలుగును నువ్వు చూసేవుంటావు. దాని రహస్యాన్ని నీకు తెలుపడానికై నేను పంపబడ్డాను. ఆ దివ్య తేజస్సొక మనుష్య గర్భాన ప్రవేశించబోతోంది. దానిని కాపాడవలసిన విధి నీపైన నిర్ణయించబడ్డది. నీ తరువాత పుణ్యాత్ములైన ఈ పుణ్యక్షేత్రపు ప్రజలపైనవుంది. ఈ అవతారానికి కారణము విను. పురుషధర్మం చెడ్డదా, లోకానికి ఆపదలేదు కాని గృహిణి మాతయైన స్త్రీ శీలం చెడిందా ప్రపంచం మొదలంట నాశనమే. కలిపురుషుడు పురుషుల్ని ఆక్రమించాడు, ధ్వంసం చేశాడు. పరిక్రమించాడు. ఇప్పుడు స్త్రీలని కదిల్చాడు. ఈనాడు స్త్రీల ధర్మాన్నీ ఆచారాన్నీ నాశనం చేయడానికై బద్ధకంకణుడైనాడు. అతని అధికారం సాగిందా, ఇంక ప్రపంచం వినాశమే! ఆ ఆపదనించి లోకాన్నుద్ధరించడానికే అవతార మవసరమయింది. ఎంతో బలవంతంమీద తన అర్ధాంగిని, పార్వతిని, కొంతకాలం ఎడబాసి వుండడానికి మంగళమూర్తి పరమేశ్వరు డంగీకరించాడు. సమస్త దేశాలలో పవిత్రదేశమూ, కర్మభూమియైన ఈ భారతదేశంలో స్త్రీ ధర్మ పునరుద్ధారణకై విరివిగా వ్యాపిస్తున్న ఈ పునర్వివాహ, విద్యాదిమహాపాతక విధ్వంసనానికై అంబ అవతారమెత్తుతుంది. మహిషాసురమర్ధని సంస్కార ప్రియమర్ధని కాబోవుతున్నది, ప్రాముఖ్యంగా స్త్రీ పాతివ్రత్యానికి మూలవిరాట్టగువితంతువుల నుద్ధరింపబూనిన పార్వతివితంతుగర్భాన్నేజన్మమెత్తి పురుషుడి నిమిత్తం లేకుండానే తాను ప్రవేశించి, అవతారమెత్తతలుచుకున్నది. రేపు రాత్రి గర్భప్రవేశము, నవమాసములు కాలాతీతముగనక, షణ్మాసాలలోనే ఆమె భూపతనము కాదలుచుకున్నది. ఈ పుణ్యక్షేత్రంలోని వితంతువర్గంలో ఒకరిని దీక్షాపరురాలిని ప్రత్యేకించి నీవు చూచి

నటయితే, ఆమెలో ప్రవేశింప ఆ జ్యోతి వూనుకున్నది" అని చెప్పి అంతర్ధానమైనాడు.

"ఎవరు ఆ అనుగ్రహానికి పాత్రుల్లో, మీలో ఎవరో, నిర్ణయించండి. కాని ఒకటి మరచిపోకూడదు. ఆమె వితంతువు ఐవుండాలి. ఇంతవరకు ఏ పురుషస్పర్శను యెరిగివుండకూడదు. ఈ విషయమై ఏ మాత్రము దోషమున్నా ఆజ్యోతి భగ్గున నిలువునా మనిషిని కాలుస్తుంది. "ఎవరు యోగ్యులో వారే అగ్గిగుండాని కెదురుగా నిలబడండి" అన్నాడు. సభంతా నిశ్శబ్దం. ఎవరూ ముందుకురాలేదు. "ఎవరూ! ఒక్కరూ, లేరా?" అన్నాడు.

ఎవరూ లేరా, ఈ పుణ్యక్షేత్రంలో?

బాలవితంతువులను వెతుకుతున్నాయి, సభికుల కళ్ళు.

"ఎవరూ రాకపోతే,___"

అంటూ కిందికివాల్చిన కళ్ళతో, వొణుకుతున్న పెదవులతో మెల్లిగా వచ్చి నుంచుంది, పున్నమ్మ.

పున్నమ్మనిచూచి అందరూ ఆనంద పరవశులైనారు. "ఈనాటి నుంచి ఆర్నెల్లవరకు నీ ఈశ్వరపత్నివి, సుమంగలివి, ధన్యురాలవు," అని తానే కుంకుమను ఆమెనొసట పెట్టాడు. పూలదండలు వేశాడు.

ఆ రోజునుంచి పున్నమ్మ పూర్తిగా ముత్తయిదు వేషం ధరించింది. ఆ పుణ్యవేషం ఆమెకి కొత్త అందాన్నిచ్చింది. ఆ ఆర్నెల్లు ఆమెని మధ్య కూచోబెట్టి భజనలూ, పూజలూ, సంస్కారాలూ, నైవేద్యాలూ ఎగిరిపోతున్నాయి. ఈ వార్త వ్యాపించి అనేక ప్రదేశాలనించి ప్రజలు వచ్చి చూసి పోతున్నారు. విచిత్రంగా ఆమెకి గర్భ చిహ్నాలన్నీ కలిగాయి. తీర్థులుకూడా ఆమెకి నమస్కారాలూ, పూజలూ సాగించాడు. తనకి చాకిరీ చెయ్యనీడు. తన శుశ్రూషకి రాత్రులు వుండనీడు. రోజూ అందర్నీ కూచోబెట్టి, ఆ అవతారకన్య చెయ్యగల ఘనకార్యాలనూ పున

రుద్ధణనూ గురించి పెద్ద వుపన్యాసాలిస్తున్నాడు త్రిలోకాలూ సంతోషిస్తున్నాయనీ, దేవతలు మంగళహారతులతో వొచ్చిపోతున్నారనీ, పూల వర్షాలు కురుస్తున్నాయనీ, కాని అవి శ్వాసకులు ప్రబలంకావడంచాతా, మ్లేచ్ఛ ప్రభుత్వం కావడంచాతా, ఆ వుత్సాహాలన్నీ ప్రజల కంటబడేటట్టు చెయ్యటంలేదన్నాడు.

ఆఖరికి తీర్థులు చెప్పినట్టు ఆరోనెల నిండకుండానే నొప్పులు వచ్చాయి. ఈ వార్త వ్యాపించగానే చుట్టుపక్కల ప్రజలందరూ వేలకొలది పోగైనారు. ఒకటే భజనలు, ప్రార్థనలు. వీలైనంతమంది స్త్రీలు గది లోపలచేరారు. నాలుగుగంటలు శ్రమపడ్డ తరువాత "ఉదయించింది ఉదయించిం"దన్నారు. ఉత్పాతాలు జరుగుతాయో, లేక శుభ సూచకాలు కలుగుతాయో, తమ కళ్ళు భరించగలవో లేదో అని అందరూ కళ్ళు మూసుకున్నారు. ఎంతకాలం కళ్ళుమూసుకున్నా యేమీ జరగలేదు. కళ్ళు తెరిచారు. గదిలోవాళ్ళు బిడ్డని చూపరు, మాట్లాడరు.

చివరికి తీర్థులు వొచ్చి—

"నాకు తెలీకండా దేవికి ఏదో అపచారం జరిగింది. కనక అవతారం వుపసంహరించుకుంది జపంచేసి కనుక్కొని చెపుతాను" అని మళ్ళీ కన పళ్ళేదు ఆ వూళ్ళో. చివరికి పుట్టినపిల్లనిచూస్తే కదలడంలేదు. దానికి మొహమంతా గుంటలు. ఎవరో డాక్టరొకడుండి—"ఇది 'సిఫిలిస్' పిల్లదా" అన్నాడు.

★